www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
5
చిత్తూరు



నేడు నగర పాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (22.5.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరు కావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

దళితుల సమస్యలపై సమావేశాలు పెట్టరా?

- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సమావేశాలకు మంగళం
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- పూతలపట్టు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

ప్రజాశక్తి- యాదమరి:

ఎంతోమంది మేధావులు, ఎన్నోఏళ్ల పోరాట ఫలితంగా దళితుల సమస్యల పరిష్కారం కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏఆర్పటు అయ్యింది. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం కమిషన్ ఆదేశాలను చట్టంగా మార్చాయి. దళితుల సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల స్థాయి అధికారులు మూడు నెలలకు ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారించేందుకు చొరవ చూపాలని ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి తప్ప, పూతలపట్టు నియోజకవర్గంలో మాత్రం ఈ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశాలును మండలస్థాయి అధికారులు గాలికి వదిలేశారు. పూతలపట్టు నియోజకవర్గంలోని, బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలంలో అధికసంఖ్యలో దళితుల భూ సమస్యలతో తహాశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే దళిత సంక్షేమ, అభివద్ధి పథకాలు, భూ సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు అమలు అన్నిరకాల సంబంధించిన అంశాల పైన ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉంటుంది.

మండల కమిటీలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు ఛైర్మన్‌గా మండల తహాశీల్దార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, జడ్పిటిసి, ఎస్సీ ఎస్టీ, సర్పంచులు, వివిధ దళిత కులసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈసమావేశంలో ఎస్సీ దాడులు, భూ సమస్యలు, అన్ని రకాల అంశాలు చైర్మన్ ఆధ్వర్యంలో అధికారులు దష్టికి తెచ్చిన అంశాలను మూడు నెలల వ్యవధిలో పరిష్కరించాల్సి ఉంటుంది. ఆ తరువాత సమావేశంలో గతంలో అందిన సమస్యలు పునరావతం కాకుండా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అయితే పూతలపట్టు నియోజకవర్గంలో దళితుల సమస్యలు కుప్పలు తిప్పలుగా ఉన్న ప్రతిరోజూ మండల కేంద్ర కార్యాలయాలకు కాళ్లు అరిగేలా తిరుగుతున్న ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకునే పాపానపోలేదు. కనీసం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలైన జరిగిన అందులో చర్చించి సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో పరిష్కారానికి నోచుకోని అంశాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా కమిటీలో చర్చించేందుకు వేసులుబాటు ఉంటుందని మండల దళిత సంఘం నాయకులు వాపోతున్నారు.



కాంచి వరపు సురేంద్ర, సిఐటియు చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

దళితుల సమస్యలపై చర్చించాలి
- ఈశ్వరయ్య, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రతి మూడు నెలలకు ఒకసారి మండలంలో దళితుల సమస్యలపై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు తహాశీల్దార్ చొరవ తీసుకొని నిర్వహించాలని కోరారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు దళిత సర్పంచులు ఆధ్వర్యంలో దళితుల సమస్యలపై సమావేశాలు నిర్వహించాలన్నారు.

నాలుగేళ్లుగా విజిలెన్స్ కమిటీ జరగడం లేదు
- వరదరాజులు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు



పూతలపట్టు నియోజకవర్గంలోని 5 మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించిన దాఖనాలు లేవు. దీని సంబంధించి తహాశీల్దార్ పలుమార్లు వినతిపత్రం అందించినా పట్టించుకోని పాపాలు పోలేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి మండలంలో దళిత సమస్యలపై సమావేశాలు నిర్వహించి దళితుల సమస్యలు పరిష్కరించాలి.

దళితుల భూములకు పట్టాలివ్వాలి
- కాంచి వరపు సురేంద్ర, సిఐటియు చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం పేదల అనుభవంలో ఉన్న భూములకు అసైన్మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇచ్చే కార్యక్రమం చేస్తుంది. ఇందులో పూతలపట్టు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, దళిత రైతులు వారు సాగు చేసుకుంటున్న భూములకు ప్రతి ఒక్కరికి పట్టాలి ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

గాలీవాన బీభత్సం

- మామిడి, బొప్పాయి, టమోటా, పంటలకు తీవ్ర నష్టం
- పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- రైతులకు కోలుకోలేని దెబ్బ



వానకు నేలరాలిన మామిడి కాయలు

ప్రజాశక్తి- సోమల: మండలంలో ఆదివారం మధ్యాహ్నం గాలివానతో కూడిన భారీ వర్షం పడటంతో మండలంలోని పలు ప్రాంతాలలో మామిడి, బొప్పాయి, టమోటా, బంతిపూల పంటలకు తీవ్ర నష్టం కలిగింది. అకాలవర్షం కారణంగా తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంకంభంవారి పంచాయతీలోని గాండ్లపల్లె, చెనకవారిపల్లె, కురవపల్లె, కంభంవారిపల్లె గ్రామాలకు చెందిన పలువురు రైతులకు చెందిన మామిడి తోటల్లో గాలి కారణంగా మామిడికాయలు నేలరాలాయి. మామిడికి మంచి ధర వస్తున్న సమయంలో కాయలు నేలరాలడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర-నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇతర పంటలు కోతకు వచ్చిన సమయంలో గాలి కారణంగా లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. గాండ్లపల్లెలో ఎంపీయుపి పాఠశాల ప్రహరీ గోడపై చెట్టు పడిపోవడంతో ప్రహరీ గోడ పాక్షికంగా దెబ్బతింది. చెనకవారిపల్లెలో టమోటా, బంతిపూల పంటలపై అకాల వర్షం ప్రభావం చూపించింది. చెనకవారిపల్లెకు చెందిన నాగేశ్వరరావు ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో ఇంటిలోని చిన్నారి సావిత్రి (2) తీవ్రంగా గాయపడింది. కాగా కురవపల్లెలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



నేలకూలిన వృక్షాలు



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

క్రీడలను ప్రోత్సహించాలి

ఎపిఎస్ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ విజయానందరెడ్డి



బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభసభలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చదువుతో పాటు క్రీడను ప్రోత్సహించాలని ఆర్‌టిసి రిజనల్ ఛైర్మెన్ విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మెసానికల్ క్రీడామైదనం ఇండోర్ స్టేడియంలో బ్యాటిమెంటన్ చిత్తూరు టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న వారికి కూగా ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. క్రీడల పట్ల అసక్తి ఉన్న పిల్లలన్ని తల్లిదండ్రులు ప్రొత్సహించాలన్నారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ చిత్తూరుకు మెసానికల్ క్రీడామైదానం ఉండటం గొప్ప వరమన్నారు. చదువుతో పాటు క్రీడాల్లో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా బ్యాటిమెంటన్‌లో రాణిస్తున్న క్రీడాకారులకు విజయానందరెడ్డి జ్ఞాపికలను ప్రధానం చేశారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ మంత్రి అమరనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నందమూరి ఆశయ సాధన కోసం తెలుగుదేశం శ్రేణులు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని మినీ మహానాడు నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి ప్రజా సంఘాల నేతలు అధికార పార్టీ అడగాలను సమర్థవంతంగా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి కార్యాకర్త పనిచేయాలన్నారు. జగన్‌పాలనలో అన్నివర్గాలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీ అధికారం కైవశం చేసుకోవడం ఖాయమన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయకుండా నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఈసందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళ్ళు అర్పించారు. సమావేశంలో నాయకులు పురివర్తి నాని, దొరబాబు, గోనివారి శ్రీనివాసులు, కఠారి హేమలత, గాలి భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



మినీ మహానాడుకు హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతదేహాన్ని బావి నుంచి వెలికితీస్తున్న గ్రామస్థులు

ప్రజాశక్తి- సోమల: ఈతకు వెళ్లితొమ్మిదేళ్ల బాలుడు బావిలో మునిగిని మరణించిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లి గ్రామానికి చెందిన ప్రభు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు మనోహర్ (9) గ్రామం సమీపంలోని గంగిరెడ్డిగారిపల్లి చెరువు వద్ద గల బావిలో ఆదివారం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు గ్రామంలోని పిల్లలతో కలిసి వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులంతా బావి వద్దకు చేరి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో పుంగనూరు అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేయడం కష్టతరమైంది. దీంతో గ్రామస్తుల సహకారంతో ఆరు విద్యుత్ మోటార్లను అమర్చి బావిలోని నీటిని బయటకు తోడి వేస్తున్నారు. బావిలో మొత్తం నీరు మోటార్లతో కొట్టిన తర్వాత బాలుడు కోసం గాలింపు చర్యలు చేపడతామని పుంగనూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. దాదాపు 5 గంటల సేపు గాలింపు చర్యలు చేపట్టి బావిలోని నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడి రాత్రి 8.30 గంటలకు బాలుడు మతిచెందిన స్థితిలో గుర్తించి బావి నుండి వెలుపలకు తీశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడి తల్లిదండ్రులు చిన్నారి మతదేహాన్ని చూసి ఏడుస్తుండగా వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



వెలికితీసిన బాలుడి మృతదేహం



మృతుడు మనోహర్ (ఫైల్‌ఫొటో)

నవరత్నాలతో పేదల ఆర్థిక అభివృద్ధి

ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి- రామకుప్పం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నవరత్నాలతోనే సాధ్యమవుతుందని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఉనిసిగానిపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటిఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమాలు పారదర్శకంగా అమలు అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ఇంటి స్థలాలతో పాటు గహ నిర్మాణాలు చేపడతామన్నారు. గ్రామ వీధుల్లో డ్రైనేజీలు, రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు సమస్యలు లేకుండా అధికారులు పంచాయతీ పాలకులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల నుండి నాలుగు లక్షల రూపాయల వరకు వివిధ సంక్షేమలతో లబ్ధి పొందుతున్నరని ప్రజలకు గుర్తు చేశారు. జగనన్న పాలనతో రాష్ట్రంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి, ఉన్నత విద్య, ఉపాధి, స్వయం సహకార సంఘాలకు చేయూత, వద్ధులకు పెన్షన్లు, రైతన్నలకు రైతు భరోసా తదితర వాటిని అమలు చేసి రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నేత్రవతి నాగిరెడ్డి, ఎంపిటిసి సులోచన గుర్రప్ప, ఎంపిపి సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, వైసీపి కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తీవ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా

రాక్షసక్రీడా చిత్రం



ప్రజాశక్తి-యాదమరి: జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినం సందర్భాన్ని పురస్కరించుకుని యాదమరి చిత్రకారుని చిత్ర స్పందన.
21-5-1991 మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని తీవ్రవాదులు పొట్టన పెట్టుకున్న రోజును నాటి ప్రధాని విపి.సింగ్ ప్రభుత్వం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినంగా ప్రకటించారు. నాటి నుండి జాతి యావత్తు జరుపు కోవడం ఆనవాయితీ. యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి తీవ్రవాదంపై చిత్రాల ద్వారా తన కుంచెతో తిరగబడ్డారు.

1.రాక్షసక్రీడ (ఆయిల్ కలర్స్)

హింసవిశ్వరూపం దాని తాలూకు నరమేధం, బెల్టు బాంబుతో సష్టికి మూలమైన స్త్రీవినాశనానికి పూనుకున్న వైనం, పక్కనే పైశాచికత్వాన్ని పరాకాష్టగా శవాల గుట్ట వేదనా శిఖరాలని ఆవిష్కరిస్తుంది.

2.హింస ప్రభావం: (అక్రీలిక్ రంగులతో)

తీవ్రవాదం పడగలిప్పితే బలి అయ్యేది సామాన్యులే. ఎన్నో కుటుంబాలు సర్వనాశనం కావడం, ప్రజాజీవనం అశాంతికి గురి కావడం అందరికీ తెలిసిందే.

3. ప్రజారక్షకుడు: (అక్రీలిక్ రంగులు)



మన మధ్యలో వుంటు మనల్ని కంటికి రెప్పలా కాపాడే వీరుడు పోలీస్. అత్యాచారాలు, దోపిడీ, తీవ్రవాదం వీటిపై పోరాడి శాంతి నెలకొల్పే త్యాగజీవి. అభయ హస్తంలా భరోసా నిచ్చే ప్రజారక్షకుడు.

గ్రామీణ మహిళలకు ఆర్థిక చేయూత

ఇంటర్వ్యూ

డిఆర్‌డిఎ పిడి తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చేయూతను అందించేలా అనేక పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళలకు వైఎస్ఆర్ చేయూత, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు మంజూరు, స్త్రీ నిధి, జగన్న షాపింగ్ మాల్ వంటి పథకాలను అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు అత్యంత ప్రతిష్టంగా తయారు చేయడం కోసం గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. ఇందు కోసం డిఆర్‌డిఎ ఏపిఎంలు, సంఘమిత్రలు అందుబాటులో ఉంటు స్వయం సహాయ సంఘాల సభ్యులకు సలహాలు సూచనలు అందించడంతో పాటు బ్యాంకుల నుండీ రుణాలు ఇప్పిస్తున్నారు. మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోందని పిడి తులసి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.

ప్రజాశక్తి: వైఎస్ఆర్ బీమా అర్హత ఏమిటి?

డిఆర్‌డిఏ పీడి: వైఎస్ఆర్ బీమా పథకం 18 నుండీ 70 సంవత్సరాల వయసు గల వారికి వర్తిస్తుంది. జీవన్ జ్యోతి భీమా పథకం కింద చిత్తూరు జిల్లాలో 11,54,156 తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్న కుటుంబ యజమానికి మాత్రమే బీమా చేయడం జరుగుతుంది. దీనికి సంబంధించి బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ పథకం ద్వారా సహజ మరణానికి లక్ష రూపాయలు, ప్రమాద మరణానికి ఐదు లక్షలు పూర్తి అంగవైకల్యం కలిగినప్పుడు ఐదు లక్షలు బీమా చెల్లించడం జరుగుతుంది.

ప్రజాశక్తి: డిఆర్‌డిఎ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో వైఎస్ఆర్ చేయూత ఒకటి. ఈ పథకం ద్వారా ప్రయోజనం ఏమిటి?

డిఆర్‌డిఎ పిడి: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ చేయూత పథకం కింద 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటి మహిళలకు రూ.18,750ల చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.75000 మంజూరు చేయబడుతుంది. చిత్తూరు జిల్లాలో 1,035 గ్రామ సచివాలయ పరిధిలో ఈపథకం కింద 2021 సంవత్సంలో మొదటివిడతగా 1,73,475 మంది లబ్దిదారులకు రూ.325.27 కోట్లు, 2022 సంవత్సంలో రెండో విడతగా 1,86,116 మంది లబ్దిదారులకు రూ.348.97కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: ఆసరా పథకం అమలు ఎలా ఉంది?

డిఆర్‌డిఎ పిడి: ఎపి రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు అమలు చేయడంతో భాగంగా వైఎస్ఆర్ ఆసరా పథకం కింద స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణమాఫి కల్పించుటకు 11,4,2019 తేది వరకు బ్యాంకు నందు నిల్వ ఉన్న లోన్‌ను నాలుగు దఫాలుగా 60,388 సంఘాల పొదుపు ఖాతాలకు రూ.2319.49 కోట్లు జమచేయడం జరిగింది. అందులో భాగంగా 2020 సెప్టెంబర్ 11వ తేదిన 60,440 గ్రూపులకు సంబంధించిన 5,58,752 మంది సభ్యులకు రూ.579.74కోట్ల మొదటివిడత విడుదల చేయబడింది. అదే విధంగా రెండువ విడత అక్టోబర్ 2021వ సంవ్సరంలో 582.18 కోట్ల రూపాయులు రుణమాఫి నిధులు విడుదల చేయడం జరిగింది.

ప్రజాశక్తి: జగన్నతోడు చిరువ్యాపారులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది?

డిఆర్‌డిఎ పిడి: జగన్నతోడు అనే కొత్తకార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టడం జరిగింది. ఈపథకం ముఖ్యఉద్దేశం చిరు వ్యాపారులకు అంటే ఫుట్‌పాత్‌లపై విక్రయిండం, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్మడం, రోడ్డు పక్కన టిఫిన్, ఆహార పదార్థలను విక్రయించే చిన్నచిన్న దుకాణాల యజమానులకు రోజువారీ పనిచేసే వారికి మూలధనాన్ని అందించడం. సాంప్రదాయ హస్తకళలలో నిమ్నమైన చేతివృత్తుల వారికి రూ.10వేలు సున్నా వడ్డీతో రుణం అందించడం, ఆర్థిక సాయం పొందడానికి ఎలాంటి పూచికత్తు అవసరం లేదు. ఈపథకం కింద 2021-22 సంవత్సరంలో 42,322 మంది చిరువ్యాపారులకు బ్యాంకుల ద్వారా ఇప్పటి వరకు 42.32 కోట్ల రూపాయులు రుణసౌకర్యం కల్పించబడంది.

ప్రజాశక్తి: బ్యాంకు లింకేజి స్త్రీనిధి ఎంత ఇచ్చారు?

డిఆర్‌డిఎ పిడి: స్వయం సహాయక సంఘాలకు ఏప్రిల్ 2021 నుండి జనవరి 2022 వరకు 37,702 స్వయం సహాయక సంఘాలకు రూ.1919.16 కోట్ల రుణ సౌకర్యం కల్పించాము.

స్త్రీ నిధి: ఈ పథకం కింద 2021-22లో 78,616 స్వయం సహాయక సంఘాల రూ.295.08కోట్ల రూపాయలు రుణసౌకర్యం కల్పించాము. అలాగే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల శ్రేయస్సు కొరకు ఉన్నతి (పిఓపి) పథకం ద్వారా రుణాలను త్వరితగతిన మంజూరు చేయడం జరుగుతోంది. తద్వారా కుటుంబాలకు ఆదాయ వనరులు చేకూర్చే కార్యక్రమాల ద్వారా జీవనోపాధిని పెంపొందించు కొనుచున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో 181మందికి గాను రూ.0.51 కోట్ల రూపాయలు విడుదల చేయడమైంది.

ప్రజాశక్తి: డిఆర్‌డిఏ ద్వారా నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పన కోసం చేసిన కృషి ఎలా ఉంది?

డిఆర్‌డిఎ పిడి: సొసైటిఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ కింద జిల్లాలో సీడాప్- డిఆర్‌డిఎ ద్వారా అమలు కాబడుతున్న దీన్‌దయాళ్ ఉపాధ్యా గ్రామీణ కౌషల్య యోజన (డిడియుజికెవై) పథకం కింద 2021-22 సంవత్సరానికి గాను 574మంది గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించడం జరిగింది. అలాగే డైరెక్ట్ ప్లేస్‌మెంట్ జాబ్ మేళాల ద్వారా 3,692మంది నిరుద్యోగ అభ్యర్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం జరిగింది.

చిత్రలేఖనంపై అవగాహన ఉండాలి



ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులు చిత్రలేఖనంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం గ్రంథాలయ వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం విద్యార్థులలో ఒక భాగమన్నారు. బొమ్మలు గీయడానికి కొన్ని మెళకువలు పాటిస్తే ఆ బొమ్మ అందంగా కనిపిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో భాగంగా రకరకాల బొమ్మలు, జాతి పక్షి నెమలి బొమ్మను గీసి విద్యార్థులందరికీ నేర్పించారు. విద్యార్థులు బొమ్మలు గీయడంతో వారి చేతి నైపుణ్యత బహిర్గ తమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, శేషాద్రి, యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని గుడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్‌గా జి.మంజునాథ్ 3వ సారి పార్టీ బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ సుమారు 7 సంవత్సరాల నుంచి గుడిపల్లి మండలం మేజర్ గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తూ మండల తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కరోనా క్లిష్ట పరిస్థితుల్లో పంచాయతీ గ్రామ ప్రజలకు తన వంతు సాయంగా అన్నదానం, తాగునీటి వసతులు తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేస్తానని, చంద్రబాబు నాయుడుకు అత్యధిక మెజార్టీ తీసుకుని వచ్చే దిశగా పంచాయతీలో పనిచేస్తానని తెలిపారు.

వైఎస్ఆర్ ఇంటి పట్టాల పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్దచెల్లారి గుంట పంచాయతీ చిన్నచెల్లారి గుంట గ్రామంలో వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ పరిశీలకులు, చిత్తూరు జిల్లా డీసీసీ బ్యాంక్ ఛైర్‌పర్సన్ మొగసాల రెడ్డమ్మ కష్ణమూర్తి, బైరెడ్డిపల్లి ఎంపీపీ, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు ఎం.రెడ్డెప్ప సహకారంతో సర్పంచ్ కె.నారాయణ రెడ్డి, ఎంపీటీసీ రెడ్డెప్ప చేతులమీదుగా పేద ప్రజలకు జగన్ అన్న కాలనీలో ఆదివారం నూతనంగా 38 ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఓ గురివిరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ కె.అమరనాథ రెడ్డి, సచివాలయ కన్వీనర్ పి.చెంగారెడ్డి, వాలంటరీ లేపాల్ రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్యోధన వధతో ముగిసిన మహాభారతం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని గరిగలపల్లె, వెంకటాపురం గ్రామాల్లో దుర్యోధన వధ కార్యక్రమంతో మహాభారత యజ్ఞం ముగిసింది. ఆదివారం మండలంలోని గరిగలపల్లె, వెంకటాపురం గ్రామాల్లో ద్రౌపతి ధర్మరాజుల ఆలయం వద్ద ధర్మకర్తలు రాజేందర్ నాయుడు, నాగరాజుల నాయుడు ఆధ్వర్యంలో 19వ రోజు మహాభారత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్యోధన పాత్రధారి దొరస్వామి భీముడు, పాత్రధారులు సత్య ఒకరికొకరు తలపడుతూ పద్యాలు ఆలపిస్తూ నిర్వహించిన యుద్ధ సన్నివేశాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయం ముందు అగ్నినిప్పులపై కంకణం ధరించిన వారితోపాటు పలువురు భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అర్జున తపస్సు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని వివి పురం గ్రామ పంచాయతీ అంకన పల్లి గ్రామంలో వెలిసిన ద్రౌపతి ధర్మరాజు ఆలయ ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్న సందర్భంలో భాగంగా ఆదివారం అర్జున తపస్సు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తయ్యూరు, పాయుకట్టు, చుట్టుపక్కల గ్రామం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు ఆలయం లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను ఎక్కారు. ఆయన విసిరిన విభూది నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. పలువురు మహిళలు సంతానం కలగాలంటే తపస్సు మాను వద్ద వరపడ్డారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, అర్జున తపస్సు మాను ఉభయ దారులు బసివిరెడ్డి పల్లి రామచంద్రా రెడ్డి కుటుంబ సభ్యులు, డిసెంబర్ శెట్టి, గోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచులు, వైస్ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-విజయపురం: మండల కేంద్రమైన విజయపురంలో ఆదివారం చెన్నకేశవ స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్ఆర్ఐ పృథ్వి, హారిక దంపతుల కుమార్తె ఐసాని జన్మదినం పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నగరి

ప్రజాశక్తి-నగరి: మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘననివాళి అర్పించారు. ఆదివారం ఆంధ్ర రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నగరి బస్టాండ్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. అనంతరం శ్రీ పెరంబుదూర్ వెళ్లి రాజీవ్ గాంధీ స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధానిగా ఈ దేశ భవిష్యత్తుకు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఈరోజు ఐటీ రంగంలో భారత దేశం దూసుకుపోతూ ఉంది అంటే అది రాజీవ్ గాంధీ ఘనతే అన్నారు. ముఖ్యంగా గ్రామ స్వరాజ్యం పంచాయతీలకు జవహర్ రోజ్‌గార్ నిధులను కేటాయించి, పంచాయతీలకు, గ్రామాల అభివృద్ధికి మూలస్తంభం స్వర్గీయ రాజీవ్ గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో ఏఐసిసి మెంబర్ భానుమూర్తి, పిసిసి మెంబర్లు నటరాజ మొదలియార్, సుధాకర్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబు, చిరంజీవి రెడ్డి, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య, మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాపిచ్చి, దేశప్పన్, యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లోహిత రాజు, గిరి, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేసిన రాజకీయ మహోన్నత వ్యక్తి అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొరస్వామి అన్నారు. ఆదివారం స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం దొరస్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల బిసి సెల్ రెడ్డెప్ప, ప్రకాష్, సత్య మోహన్, మని వెంకటేష్, భాస్కర, రవి పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రమైన విజయపురంలో ఆదివారం స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి నగరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్ రాజు, నాయకులు నారాయణరాజు, చిరంజీవి రెడ్డి, నగరి, నింద్ర, పుత్తూరు, వడమాల పేట కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



విజయపురం

సంక్షేమ వారధులు వాలంటీర్లు: మంత్రి



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ సముదాయ ప్రాంగణంలో ఆదివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వాలంటీర్లకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాల కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 8408 మందికి రూ.8.6 కోట్లతో, పుంగనూరు నియోజకవర్గంలో 1444 మందికి రూ.1.98 కోట్లతో నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సీఎం వాలంటీర్ల వ్యవస్థకు సముచిత స్థానం కల్పించారన్నారు. సంక్షేమ పథకమైన పెన్షన్ పంపిణీలో వాన, వరద, పండుగ వచ్చినా వాలంటీర్లు ఫించన్ అందజేశారని తెలిపారు. గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థతో సిబ్బంది నియామకం, వాలంటీర్లతో కలిపి 4 లక్షల మందికి ఉద్యోగాల కల్పన, వాలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాధించారన్నారు. ప్రతి 50 ఇండ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి, కుల, మత, ప్రాంతాలకతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత మన సీఎంకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర కింద సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30 వేలు, సేవారత్న కింద పురస్కారాలతో పాటు రూ.20 వేలు, సేవామిత్ర కింద పురస్కారాలతో పాటు రూ.10 వేలు చొప్పున వాలంటీర్లకు నగదు పురస్కారంతో పాటు బట్టలు అందజేశారు. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాల నుండి అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ పి.గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డప్ప, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఎంఎల్ఎ పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం: టిడిపి



ప్రజాశక్తి-రామకుప్పం: అరాచక ప్రభుత్వాన్ని అంతమొందించేందుకు ప్రజల్లోకి వెళ్లి వ్యతిరేక విధానాలను వివరిస్తామని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మణేంద్రం, గుట్టురు తండా గ్రామపంచాయతీలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రచ్చబండ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయి మార్పునకు సంసిద్ధమయ్యారన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సిసి రోడ్లు, భవనాలు, బ్యాంకు రుణాలు చేనేత కార్మికులకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, విదేశీ విద్య, రైతులకు రుణ మాఫీ, గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఎల్ఈడి బల్బులు వేయడం జరిగిందన్నారు. పండుగలకు రేషన్ షాపుల్లో చంద్రన్న కానుకలు అందించడంతో పాటు నిత్యవసర సరుకులు అందించన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అన్న ఎన్టీఆర్ క్యాంటీన్‌ను నడిపిస్తూ నిరుపేదలకు భోజన వసతి కల్పిస్తే వైసిపి ప్రభుత్వం దాన్ని పూర్తిగా మూసివేసి ప్రజల కడుపు కొట్టారన్నారు. రానున్న రోజుల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నారాయణ చారి, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి, యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ, వెంకటాచలం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వెంకటరమణ, జ్ఞాన శేఖర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వైకల్యం అడ్డురాదు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రజా సమస్యల పరిష్కారానికి నా వైకల్యం అడ్డురాదని గంగాధర నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్ ఆదివారం అన్నారు. నాలుగవ రోజు పాదయాత్ర సందర్భంగా కార్వేటి నగరం మండలం నుంచి పచ్చికాపలం, వెదురుకుప్పం మీదుగా కొత్తపల్లి మిట్ట వరకు దిగ్విజయంగా పూర్తి చేశారు. కొత్తపల్లి మిట్ట కూడలి నుంచి మీడియాతో ఆయన మాట్లాడుతూ నారాయణస్వామి రెండుసార్లు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యారు, ఒకసారి మంత్రి అయ్యారు, ఒకసారి ఉప ముఖ్యమంత్రి అయ్యారు అయినా ఈ 49 కిలోమీటర్ల రోడ్డుని విస్తరణ చేయలేక తన అసమర్ధతను నిరూపించుకున్నారని అన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నో ఉత్తుత్తి వాగ్దానాలు చేసి ప్రజల్ని మోసం చేసి అందలం ఎక్కిన తర్వాత ప్రజలను విస్మరించి స్వార్థంతో, బంధు ప్రీతితో నియోజకవర్గాన్ని అభివద్ధికి నోచుకోకుండా చేసి, ఇప్పుడు తన కూతుర్ని ఎమ్మెల్యేగా చేసుకోవాలని ఆరాటపడుతున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక మండల పార్టీ అధ్యక్షులు చిరంజీవి, చార్లెస్, అవినాష్, సాయి, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, ఆరు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శిలు, జిల్లాకమిటీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పిఇఎస్ హాస్పిటల్ సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 68 మంది హాజరుకాగా వారిని డాక్టర్లు పరిశీలించి కంటి ఆపరేషన్‌కు 18 మందిని గుర్తించారు. అనంతరం వారిని ఆపరేషన్‌కు కుప్పం పిఇఎస్ హాస్పిటల్‌కు తరలించారు. ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో రాను, పోనూ, ఆపరేషన్ ఖర్చులు ఉచితంగా అందిస్తున్నట్లు మారుతి ఫౌండేషన్ సహాయకులు శ్రీనివాసులు తెలిపారు.

వైఎస్ఆర్ కల్యాణమస్తు కరపత్రం అందజేత



ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ 28వ వార్డు చింతల పట్టెడ గ్రామానికి చెందిన ఎఆర్ గాయత్రికి రూ.75 వేలు, పి.షాలినికి రూ.50 వేలు వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకం ద్వారా మంజూరైంది. ఆదివారం లబ్ధిదారులకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడశాఖ మంత్రి ఆర్కె రోజా మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ ఛైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, మండల సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ నళిని, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల పురవీధులలో విద్యుత్ స్తంభాల ఎల్ఈడి బల్బులు 24 గంటలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం విద్యుత్ ఆదా చేయాలని ఆకాంక్షిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు చేపట్టి విద్యుత్ ఆదా చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు ఆలయ నాలుగు మాడ విధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. అదే విధంగా 7.30 గంటల 7.45 గంటలకు వరకు చక్రతాళ్వారుకు వేద మంత్రో చ్చారణం నడుమ స్కంధపుష్కరిణి నీళ్లు లేక ఎండి పోవడంతో ఆలయ ఆవరణంలో వెండి జలపాత్రలో అవభత స్నానం చేయించారు. భక్తులు హాజరై చక్ర స్నానాన్ని సందర్శించి పునీతులయ్యారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, వేద పండితులు కంకణభట్టు గోపాలచార్యులు, దశరథి, కిరణ్ భట్టాచార్యులు పాల్గొన్నారు.

భగవద్గీత తెలుసుకున్న వ్యక్తి విజ్ఞానవంతుడు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: భగవద్గీతజ్ఞానం తెలుసుకున్న వ్యక్తి విజ్ఞాన వంతుడని ప్రబోధ సేవా సమితి మండల అధ్యక్షులు ధనంజయ అన్నారు. ఆదివారం మండలంలోని గోవర్ధనగిరి, కురపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథం ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి కమిటీ సభ్యులు మునిరత్నం, నారాయణ, ఈశ్వర్, కిరణ్, కిట్టు, మురళి, లత, పాల్గొన్నారు.

నేరాలు-ఘోరాలు

క్వారీలో శవం లభ్యం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న క్వారీ గుంతలో శవం లభ్యమైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రామాంజనేయులు కథనం మేరకు వివరాలు.. గంగాధర నెల్లూరు మండలం కేంద్రంలోని స్థానిక ఎస్సీ కాలనీ(సువేరా హెచీరీస్) సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు క్వారీలో గుర్తుతెలియని మృతదేహం బయటపడినట్లు స్థానికులు గుర్తించి, సమాచారం తెలియజేశారు. పోలీసుల విచారణలో మృతి చెందిన వ్యక్తి చిత్తూరు నగరం చంద్రశేఖర్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా చంద్రశేఖర్ భౌతికకాయాన్ని పోస్టు మార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టు మార్టం రిపోర్ట్ నివేదిక అందితేగాని పూర్తిగా తెలియరాదన్నారు.

మట్టి ట్రాక్టర్ బోల్తా... డ్రైవర్ మృతి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మట్టి ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు వివరాలు.. మడుపోలూరు గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు చిన్నయ్య (68) సమీపంలోని వసంతాపురం నుంచి మట్టిని వ్యవసాయ పొలంలోకి తరలిస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పడంతో అది గ్రహించి ట్రాక్టర్ నుంచి పక్కకు దూకేశాడు. దీంతో మట్టి లోడుతో ఉన్న ట్రాక్టర్ ఇతనిపై మట్టిని నింపేసింది. దీంతో ఊపిరాడక సంఘటన స్థలంలోనే మతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాల మేరకు...ఆదివారం తవణంపల్లి మండలం వెంగంపల్లికి చెందిన వెంకటేశులు, మిట్టూరుకు చెందిన పూర్ణచంద్రాలను కర్ణాటక టెట్రా ప్యాకెట్లు కలిగి ఉండటంతో అదుపులో తీసుకొని విచారించగా కర్ణాటక నుంచి తక్కువ ధరకు కొని ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నామని నేరమంగీకరించారు. దీంతో వీరివురిపై అక్రమ మద్యం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐ వెంకటలక్ష్మి, ఎస్సై మోహన్ బాబు, పథ్వీరాజ్, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం...




ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకట నరసింహులు కథనం మేరకు వివరాలు... బైరెడ్డిపల్లి-కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ బ్రిడ్జి వద్ద ముందస్తు సమాచారంతో స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక నుంచి బైరెడ్డిపల్లి మండలం గంగారపురు గ్రామానికి చెందిన రెడ్డప్ప సుమిత్ర సూపర్ ఎక్సెల్ వాహనంలో వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 82 డేటా కర్ణాటక ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐఎస్ఐ మార్కు వస్తువులు వాడండి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: నాణ్యతతో పాటు ఐఎస్ఐ మార్కు వస్తువులను ప్రజలు వాడుకోవాలని రాష్ట్ర స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ కష్ణవీర్ వర్మ కోరారు. ఆదివారం గంగాధర నెల్లూరు మండలం 9వ మైలు వద్ద ఆశ్రమంలో విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సౌజన్యంతో, రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీస్ సెక్రటరీ చిట్టిబాబు ఆధ్వర్యంలో షాప్ కీపర్స్, కాలేజీ విద్యార్థులు, మహిళలకు ఒకరోజు అవగాహన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎస్ఐ, హాల్ మార్క్, బిఐఎస్ కేర్ మొబైల్ యాప్ గురించి శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో మారేడుపల్లి హెచ్ఎం గంగాధరం, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు భూపతి, రవి, ఫ్యాకల్టీలు చందు, బేబీ, పద్మావతి, ట్రైనీలు జ్యోతి, సరస్వతి, రమణి, మల్లీశ్వరి, పూర్ణ, శైలజ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

'పోలీసుల వెతలు పట్టని ప్రభుత్వం'



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పోలీసుల బాధలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేషనరీ కొనుగోలుకు ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రూ.15 వేలు నుంచి రూ.40 వేల వరకు మూడు నెలలకు ఓసారి నిధులు కేటాయించడం సాధారణమని చెప్పారు. అయితే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టేషనరీకి ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రింటర్, స్కానర్, కంప్యూటర్లు, జెరాక్స్ మిషన్లు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాలుగేళ్లుగా స్టేషనరీకి బడ్జెట్ కేటాయించకపోవడంతో అవన్నీ మూలనపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రావెల్ అలవెన్సులకు దిక్కు లేకుండా పోయిందని, ఈ చేతగాని ప్రభుత్వం కారణంగా పోలీసు సిబ్బంది అప్పులపాలవుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు హయాంలో ఒక్కో పోలీస్ స్టేషన్‌కు ఒక కోటి ఇరవై లక్షల రూపాయలు వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 110 అత్యాధునిక పోలీస్ స్టేషన్లను నిర్మిస్తే, ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో ఒక్కటైనా నిర్మించిందా అని నిలదీశారు. దిశ వాహనాలు తప్ప నూతనంగా ఒక్క కొత్త పోలీసు వాహనం కూడా కొనుగోలు చేయని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. కనీసం పాత వాహనాలకు మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం దురదష్టమన్నారు. రక్షక్, హైవే, పెట్రోలింగ్ వాహనాలకు కేటాయించే డీజిల్ కోటాలను కోత విధించడాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో నెలకు 200 లీటర్లు డీజిల్ ఇస్తుండగా.. ఇప్పుడు 120 లీటర్లకు తగ్గించారని, అలాగే పట్టణాల్లో పెట్రోలింగ్ చేసే ద్విచక్ర వాహనాలకు నెలకు 45 లీటర్లు కోటా ఉండగా దాన్ని 30 లీటర్లకు మండల స్థాయి స్టేషన్లలో నెలకు 20 లీటర్లకు తగ్గించడంతో పగలు, రాత్రి పూర్తి స్థాయిలో పెట్రోలింగ్ చేయలేకపోవడం నేరాలు పెరిగిపోతున్నాయి తెలిపారు. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మనసు మార్చుకుని పోలీసింగ్ పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన హితబోధ చేశారు.